క్లుప్తంగా

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవోపేతంగా జరిగాయి. స్వామివారికి నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు, చూర్ణోత్సవం, మహా పూర్ణాహుతి, అవబృధోత్సవాన్ని వేద పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యుల బృందం వేద మంత్రోచ్చరణ నడుమ చేపట్టారు. స్వామివారి గరుడోత్సవం మేళతాళాలు, కనక డప్పుల వాయిద్యాలతో కనుల పండువగా నిర్వహించారు. శ్రీ సరస్వతీ కోలాటం భజన మండలి, ద్వాదశ ప్రదక్షిణాలు జరిగాయి. కార్యక్రమంలో ధర్మకర్తలు కొప్పురావూరి రవీంద్ర, మురాల నరేష్, కాగితం హరికృష్ణ, చిలంకుర్తి వెంకటేశ్వరరావు, కోడె శారద, బలే కల్పన తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి వెండి కడియాలు బహూకరణ



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామికి దాతలు వెండి కడియాలను బహూకరించారని ఆలయ అధికారి పీవీఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఆలయంలో దాతలు బుధవారం బహూకరించారు. ఈఓ మాట్లాడుతూ పామర్రుకు చెందిన సుంకర సత్యనారాయణ, వారి కుమారుడు దుర్గా ప్రసాద్‌లు స్వామికి సుమారు రూ.50వేల విలువ గల కడియాలను బహూకరించారని పేర్కొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థులకు అభినందన



గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి 8వ యూత్ బాల బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించారని ఆ పాఠశాల ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ హెచ్‌ఎం జి.పద్మావతి తెలిపారు. బుధవారం విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు పిఠాపురం మున్సిపల్ హైస్కూల్లో జరిగిన ఈ పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు తరఫున తమ విద్యార్థులు షేక్ అబ్దుల్ రెహమాన్, ఎ.శివలు రెండో స్థానంలో నిలిచారని తెలిపారు.

ఎన్నికల కోడ్ వర్తించదా?



పామర్రు: పామర్రు–చల్లపల్లి రహదారి పక్కనే ఉన్న జనసేన పార్టీ కార్యాలయం వద్ద కూటమి, జనసేన పార్టీ నాయకులతో ఉన్న బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఈ బ్యానర్‌ను తొలగించక పోవడంతో స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ బ్యానర్లను తొలగించిన అధికారులకు ఈ బ్యానర్ కనపడ లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చల్లపల్లి రోడ్డులో ఉన్న బ్యానర్‌ను సత్వరమే తొలగించి ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డెక్కేముందు ఆలోచించాల్సిందే

- అమల్లోకి కొత్త వాహన చట్టం
- లైసెన్స్ లేకుంటే రూ.5వేలు



వాహన తనిఖీ నిర్వహిస్తున్న తాలూకా ఎస్‌ఐ చంటిబాబు (ఫైల్)

గుడివాడరూరల్: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే రోజులకు ఇక కాలం చెల్లింది. ఇక నుంచి హెల్మెట్ లేకపోయినా, వాహన ధ్రువపత్రాలు చూపించకపోయినా రూ.వేలల్లో జరిమానాలు కట్టాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టం చెబుతోంది. గతేడాది జూన్ నుంచే చట్టం అమల్లోకి వచ్చినా అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసులు చర్యలు షురూ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడుతున్న ఈ చర్యలకు అంతా సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే మూడేళ్ల జైలు

గతంలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దగా జరిమానాలు ఏమి ఉండేవి కాదు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలకు మైనర్లు వాహనాలు నడపడం కూడా ఒక కారణం కావడంతో అధికారులు నిబంధనలు కఠినతరం చేసి, శిక్షలు అమలు చేస్తున్నారు. కొత్త వాహన చట్టంలోని రూల్స్ ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారికి రూ.25వేలు జరిమానా విధించడంతో పాటు మూడేళ్ల జైలు శిక్ష కూడా వేసే అవకాశం ఉంది.

ఇతరులకు బండిస్తే అంతే సంగతులు

చాలామంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. అయితే అది ఇకపై కుదరదు. సదరు మైనర్ బాలుడు లేదా బాలిక బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంటే వారిపై కేసు నమోదు చేస్తారు. యాక్సిడెంట్ చేసిన వారితో పాటు వాహనం ఇచ్చిన వారిపైనా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపైనా కేసు నమోదు చేస్తారు. అప్పట్లో అయితే వెంటనే స్టేషన్ బెయిల్ మంజూరయ్యేది. నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. యాక్సిడెంట్‌కు కారణమైన వ్యక్తితో పాటు సంబంధిత వాహన యజమానికి వెంటనే బెయిల్ వచ్చే అవకాశం లేదు. పదేళ్లపాటు జైలు శిక్ష కూడా పడే అవకాశాలున్నాయని పోలీసులు తెలిపారు.

జరిమానాలు ఇలా..

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేలు(గతంలో రూ.500) ఉండేది. రెడ్‌లైట్‌ను ఉల్లంఘించి వాహనం నడిపితే రూ.500. రాంగ్‌రూట్‌లో నడిపితే రూ.5వేలు. అతివేగంగా వాహనం నడిపితే రూ.1,000. మద్యం తాగి వాహనం నడిపితే రూ.10వేలు(గతంలో ఇది రూ.2వేలు ఉండేది). ర్యాష్ డ్రైవ్ చేస్తే రూ.5వేలు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్‌బెల్టు ధరించకుండా కారు నడిపితే రూ.1,000 జరిమానా, మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు. అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ.10వేలు, ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్ రైడింగ్ చేస్తే రూ.2వేలు, ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.2వేలు జరిమానా విధిస్తారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలి. వచ్చీ రానీ డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిఒక్కరూ మీ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

– కొండపల్లి శ్రీనివాస్, గుడివాడ వన్‌టౌన్ సీఐ

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేత మనోజ్ఞరెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి



విజేతలను అభినందిస్తున్న సిస్టర్ లిల్లీ, సెబాస్టియన్

పామర్రు: విజయవాడలో ఈనెల 9వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థిని మనోజ్ఞరెడ్డిని విజేతగా నిలిచిందని ఏఎస్‌ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్‌ఎం హైస్కూల్లో విజేతను బుధవారం అభినందించారు. అండర్–12 బాలికల కటా విభాగంలో మనోజ్ఞరెడ్డి ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈమెకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ వీవీఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.

అసీస్సీ విద్యార్థుల ప్రతిభ

పామర్రు: నోబుల్ మైండ్స్ ఏలూరు వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జనరల్ నాలెడ్జి, సైన్స్ టాలెంట్ టెస్టులో అసీస్సీ విద్యార్థులు విజేతలుగా నిలిచారని అసీస్సీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలస సెబాస్టియన్ పేర్కొన్నారు. విజేతలను బుధవారం స్థానిక అసీస్సీ స్కూల్లో అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో డి.తేజస్‌కృష్ణ, ద్వితీయ స్థానంలో ఎస్ దర్శికారెడ్డి, తృతీయ స్థానంలో డి శ్రీకర్ గాంధీ నిలిచారన్నారు.

వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం

పెదముత్తేవి(మొవ్వ): జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు సత్తాచటి ద్వితీయ స్థానం సాధించారని ఎస్‌ఎల్‌ఎస్‌వీవీఎస్ ఓరియంటల్ హైస్కూల్ హెచ్‌ఎం కే మాధవి తెలిపారు. అవనిగడ్డలో జరిగిన బాలికల సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో మొవ్వ మండలం పెదముత్తేవి విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. విజేతలను, పీఈటీ వర్మను కరస్పాండెంట్ ముత్తేవి గౌర కృష్ణ అభినందనలు తెలిపారు.



గెలుపొందిన విద్యార్థినులతో పీఈటీ, హెచ్‌ఎం

త్రోబాల్ పోటీల్లో ప్రథమ స్థానం

వానపాముల(పెదపారుపూడి): అవనిగడ్డ హైస్కూల్లో జరిగిన గ్రిగ్ మెమోరియల్ బాలికల సెంట్రల్ జోన్ త్రోబాల్ పోటీల్లో మండలంలోని వానపాముల హైస్కూల్ బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం రాఘవేంద్రరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన బాలికలను ఆయన అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బూరగడ్డ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు ప్రజల సహకారం అవసరం



డాక్టర్ శ్రీవీణ

గుడ్లవల్లేరు: బర్డ్‌ఫ్లూ నియంత్రణకు ప్రజల సహకారం అవసరం అని మండల అధికారులు పేర్కొన్నారు. కోళ్లు, కోడి గుడ్లు, పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రబలుతున్నందున ప్రతి గ్రామ పంచాయతీలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని వడ్లమన్నాడు వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీవీణ ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. అవి ఇవే..

- సగం ఉడికించిన(హాఫ్ బాయిల్డ్) గుడ్డు గాని, సరిగా ఉడకని ఆమ్లెట్ గాని తినకూడదు.
- చికెన్ 100 డిగ్రీల తర్వాత ఉడికించిన తదుపరి తినవచ్చు.
- ప్రజల్లో జ్వరం, దగ్గు, శ్వాస సమస్యలు ఉన్నట్లయితే దగ్గరలోని వైద్య ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే సంప్రదించాలి.
- ఇతర జిల్లాల నుంచి వచ్చే కోళ్లు, గుడ్లను కొనుగోలు చేయటం తాత్కాలికంగా నిలిపివేయాలి.
- చికెన్ షాపుల వద్ద సంపూర్ణ పరిశుభ్రత పాటించాలి.
- కోళ్ల షెడ్లు శుభ్రంగా ఉంచాలి.
- కోళ్ల షెడ్లలో నిల్వ నీటిని మార్చటం, కుళ్లిపోయిన ఆహారాన్ని తొలగించటం తప్పనిసరి.
- కోళ్లను మృతి చెందిన పక్షులను దగ్గరగా ఉంచకూడదు.
- మృతి చెందిన పక్షులను ఎవరూ కూడా చేతితో తాకరాదు.
- మృతి చెందిన పక్షులను మట్టి కింద కనీసం నాలుగు అడుగుల లోతులో పూడ్చి పెట్టాలి.

ఫార్మసీలో క్యాంపస్ ఎంపికలు

గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో దివీస్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు క్యాంపస్ ఎంపికలను నిర్వహించారు. ఈ విషయాన్ని బుధవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. బీ ఫార్మసీ లాస్ట్ ఇయర్ విద్యార్థులకు జరిగిన ఈ ఎంపికల్లో భాగంగా మొదటి దశలో రాత పరీక్ష, రెండో దశలో టెక్నికల్ ఇంటర్వ్యూను నిర్వహించారని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు 20మంది ఈ రెండు రౌండ్స్‌లో విజయం సాధించారని తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు

వ్యక్తిగత భద్రతపై అవగాహన

నిమ్మకూరు(పామర్రు): అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలోని ఏపీఆర్‌జేసీ హాస్టల్ విద్యార్థినులకు వ్యక్తిగత భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో 112 డయల్ ద్వారా పోలీసులను సంప్రదించవచ్చన్నారు. విద్యార్థినులు తమపై ఏదైనా వేధింపులు జరిగితే పోలీసులకు భయ పడకుండా ఫిర్యాదు చేయాలన్నారు.

వసతి గృహాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

పామర్రు: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల వద్ద విద్యార్థినుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బీసీ కళాశాల మహిళా వసతి సంక్షేమ గృహాలను ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ శివలక్ష్మి స్పందిస్తూ ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళామన్నారని తెలిపారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కైకలూరు: పాఠశాలల్లో చిన్నారులు గుడ్, బ్యాడ్ టచ్‌లను గుర్తించగలగాలని కైకలూరు రూరల్ ఎస్‌ఐ వి.రాంబాబు పేర్కొన్నారు. కైకలూరు మండలం ఆలపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో కేసులు నమోదు చేస్తామన్నారు.

10 కే రన్‌లో పాల్గొనండి

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం నిర్మాణ కమిటీ కన్వీనర్ పర్వతనేని జగన్మోహనరావు స్మారక 10 కే రన్‌ను జయప్రదం చేయాలని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు కోరారు. బుధవారం స్టేడియం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 6 గంటలకు 10 కే రన్ పోటీ ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో పురుషులు, స్త్రీలు, బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 12 ఏళ్లలోపు బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 10 కే రన్‌పోటీలో ప్రథమ రూ 6,116, ద్వితీయ రూ. 4,116, తృతీయ రూ. 3,116, 6 కే రన్ పోటీలలో ప్రథమ రూ 4,116, ద్వితీయ రూ. 3,116, తృతీయ రూ. 2,116, 4 కే రన్ పోటీలలో ప్రథమ రూ 3,116, ద్వితీయ రూ. 2,116, తృతీయ రూ. 1,116 లతో బహుమతులతో పాటు ఇతర బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు.

పర్వతనేనికి నివాళులు

ఎన్టీఆర్ స్టేడియం నిర్మాణ కమిటీ కన్వీనర్ పర్వతనేని జగన్మోహనరావు వర్ధంతి స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్, మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్నకు గరుడోత్సవం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామికి బుధవారం రాత్రి నిర్వహించిన గరుడోత్సవం ఘనంగా జరిగింది. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత స్వామికి గంధాభిషేకంతో పాటు విశేషాభిషేకాలను వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కళాకారులకు పింఛన్లు

గుడివాడ టౌన్: కళాకారుల సమాఖ్య గుడివాడ ఆధ్వర్యంలో కళాకారులకు పింఛన్ అందజేశారు. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయకులు ఎ. సునీత, భానుమతి, మానస, కోటి నాగరాజు, ఎస్. నాగేశ్వరరావు గేయాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సమాఖ్య గౌరవాధ్యక్షుడు బి.రామ్మోహన్ రెడ్డి కళాకారులకు ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున 20 మందికి పింఛన్లు అందజేశారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

మొవ్వ: మండలంలో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. మొవ్వ, అయ్యంకి, కోసూరు, కాజ సబ్ స్టేషన్ పరిధిలోని 2,898 సర్వీసులను తనిఖీలు చేసి 200 సర్వీస్ లో అదనపులోడు వినియోగం పై జరిమానాలు విధించారు. ఈ విషయాన్ని ఎలక్ట్రికల్ ఏఈ కె.వి.రమేష్ బాబు, ఎల్‌ఐలు డి. శ్రీహరి, డి.బెనర్జీ వెల్లడించారు. మండలంలోని 21 గ్రామాల్లోని పలు డొమెస్టిక్, కమర్షియల్ సర్వీసులను తనిఖీ చేసి, రూ.6,01,200ల జరిమానా విధించారని తెలిపారు.

చికెన్ దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి

గుడ్లవల్లేరు: చికెన్ దుకాణ యజమానులు తగిన జాగ్రత్తలు పాటించకపోతే బర్డ్‌ఫ్లూ మహమ్మారి బారిన పడటం ఖాయమని గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు హెచ్చరించారు. బుధవారం గుడ్లవల్లేరులోని చికెన్ దుకాణాల యజమానులతో మాట్లాడారు. వ్యాధి ఉన్న ప్రాంతాల నుంచి కోళ్లు, గుడ్లను దిగుమతి చేసుకోకూడదన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శ

గుడ్లవల్లేరు: మండలంలోని వైఎస్సార్ సీపీ నేతలను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ బుధవారం పరామర్శించారు. డోకిపర్రులో పితృ వియోగానికి గురైన వ్యవసాయ సలహా కమిటీ మాజీ మెంబర్ పామిరెడ్డి సతీష్‌రెడ్డిని దుక్కిపాటి పరామర్శించారు. అలాగే గాదేపూడి మాజీ సర్పంచ్ అప్పినీడి నాంచారయ్య నానమ్మ ఇటీవల మృతి చెందింది. ఆయన కుటుంబాన్ని కూడా దుక్కిపాటి పరామర్శించారు. కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మహ్మద్ బాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ మాజీ జిల్లా డైరెక్టర్ ప్రభాకర్, నాయకుడు భాస్కరరావు, సర్పంచ్ కె.నాగు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు భూమి పరిశీలన

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలంలో బుధవారం ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్‌హెచ్ షారోన్ స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. అయ్యంకి పంచాయతీ పరిధిలో పెట్రోల్ బంకు కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని పరిశీలించారు. మొవ్వ పరిధిలోని ఇండియన్ ఆయిల్ బంకు పని తీరుతెన్నులను పరిశీలించారు. వేములమడలో కొనసాగుతున్న రీ సర్వేని పరిశీలించి సర్వేయర్ల ద్వారా వివరాలను సేకరించారు. శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్లో ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ మస్తాన్, సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసరావు, రీ సర్వే డీటీ జగన్మోహన్‌రావు, సర్వేయర్ కిషోర్‌బాబు, ఆర్‌ఐ విజయ్‌దుర్గ పాల్గొన్నారు

చెత్త తొలగింపు

గుడివాడ టౌన్: టిడ్కో గృహాల వద్ద పెరిగిపోతున్న చెత్తను తొలగించేందుకు పురపాలక సంఘం స్పందించింది. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ మంగళవారం వినూత్న రీతిలో నిరసన ప్రదర్శించడంపై స్పందించిన కమిషనర్ చెత్తను తొలగించే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కమిషనర్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

మండవల్లి: మండవల్లిలో నేషనల్ హైవే వద్ద రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రోడ్డుకు గతంలో ఏర్పాటు చేసిన తూము ద్వారా డ్రెయినేజీ నీరు సక్రమంగా వెళ్లకుండా వెనుకకు మరలుతున్నాయి. దీంతో కైకలూరు వీధి ప్రాంత వాసులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ రహదారి కింద నుంచి తూము ద్వారా మురుగు నీరు బయటకు వెళ్లడానికి డ్రెయినేజీ ఏర్పాటు చేస్తున్నారు. ఆరు రోజులు ఈ పనులు జరుగుతాయని సిబ్బంది తెలిపారు. కైకలూరు వీధి నుంచి గుడివాడ, కైకలూరు వెళ్లే వాహనదారులు వేరే వీధి నుంచి పంపుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గుడివాడరూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి అన్నారు. మండలంలోని వలివర్తిపాడులో ఏఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలోని మినుము సాగును ఆమె పరిశీలించి, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆధునీకరణ చేయటానికి రైతులకు 11అంకెల ప్రత్యేక విశిష్ట సంఖ్య తీసుకొచ్చి అమలు చేస్తోందన్నారు. రైతు సేవాకేంద్రంలో పొలం ఉన్న ప్రతి రైతు తమ వివరాలను నమోదు చేసుకుని ఈ ప్రత్యేక నంబరును పొందాలని కోరారు.

16న సంకష్ట చతుర్థి

కైకలూరు: ద్విజప్రియ సంకష్ట చతుర్థి ఈ నెల 16నకైకలూరు బైపాస్ రోడ్ ఆది వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తారని అర్చకులు రుద్రపాక వెంకట సుబ్రహ్మణ్య శర్మ బుధవారం తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక గరికపూజ నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూజలోపాల్గొనే భక్తులు 90528 68100లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం



మండవల్లి: నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షిక మహోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో తిరుపతమ్మ కల్యాణం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు–ఉయ్యూరు ప్రధాన రహదారిలోని బందరు కాలువ వంతెన వద్ద ఉన్న శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో అమ్మవారి కల్యాణోత్సవం బుధవారం వేడుకగా సాగింది. చిప్పల కర్ణా, అనులత దంపతులు పీటలపై కూర్చుని శ్రీగోపయ్య, తిరుపతమ్మల కల్యాణం జరిపించారు. తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెంతోపాటు పలు గ్రామాల భక్తులు అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ధర్మకర్త చిప్పల పాపాయమ్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.